ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 06.03.2026 సమయం. 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. వర్గీరకణలో న్యాయం ఉండడం వల్లే ఎన్ని అడ్డంకులు ఎదురైనా మాదిగలకు అండగా నిలబడ్డానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

2. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఇంచార్జ్ మంత్రులు ఈరోజు ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మార్గ నిర్దేశం చేశారు.

3. హైదరాబాద్ లోని అంబర్ పేట ఫ్లై ఓవర్ సర్వీస్ రోడ్డు నిర్మాణానికి కేంద్రం నిధులు మంజూరు చేసినా దళారుల జోక్యంతో పనులు జరగడం లేదని ఆరోపిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి లేఖ రాశారు.

4. నారీ శక్తి అనే భావన కేవలం బిజెపి నినాదం కాదని దేశ నిర్మాణానికి సంబంధించిన ఒక జాతీయ మిషన్ అని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు.

**రేవంత్ రెడ్డి**

మాదిగలకు అండగా నిలబడి తాను మిత్రధర్మాన్ని నిర్వర్తించానని, వర్గీకరణలో న్యాయం ఉండటం వల్లే.. అండగా నిలబడ్డానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత వర్గీకరణను అమలు చేసిన మొదటి రాష్ట్రం మనదే అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్ లోని శిల్పకళా వేదికలో ఈ మధ్యాహ్నం మాదిగ ఎంప్లాయిస్ కో

ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అభినందన సభ నిర్వహించారు. ఈ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... గడిచిన ఇరవై సంవత్సరాలుగా మాదిగ సమాజం పోరాటాన్ని స్వయంగా చూశానని, ప్రతి సందర్భంలోనూ అండగా నిలిచానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. బర్రెలు, గొర్రెలు ఇవ్వడం కాదని, చెప్పులు కుట్టిన జాతి ఇప్పుడు కలెక్టర్లు, డాక్టర్లు, ఇంజనీర్లు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులే తమ సర్కారుకు కళ్లూ, చెవులూ అని పేర్కొంటూ, విద్య ద్వారా మాత్రమే మాదిగ జాతి జీవితాల్లో నిజమైన మార్పు సాధ్యమని అన్నారు.

**బైట్ - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, అడ్లూరి లక్ష్మణ్ సహా పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

**డెస్క్**

**కిషన్ రెడ్డి**

హైదరాబాద్‌లోని అంబర్‌పేట ఫ్లై ఓవర్ కింద సర్వీస్ రోడ్డు నిర్మాణం పూర్తి కాకపోవడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, లేఖ రాశారు. 265 కోట్ల రూపాయలతో నిర్మించిన ఈ కిలో మీటర్ ఫ్లైఓవర్ ను గత యేడాది మే 5వ తేదీన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించారు. అయినప్పటికీ భూసేకరణ అసంపూర్తిగా ఉండటంతో సర్వీస్ రోడ్డు నిర్మాణం ఇప్పటికీ నిలిచిపోయింది. 2018లో మంజూరైన ఈ ప్రాజెక్టుకు 2 కోట్ల 54 లక్షల పరిహారం చెల్లించినా మధ్యదళారుల జోక్యంతో పని ముందుకు సాగడం లేదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లేఖలో పేర్కొన్నారు. కేంద్రమంత్రి గడ్కరీ స్వయంగా రాష్ట్ర మంత్రులకు పలుమార్లు చెప్పారని, GHMC కమీషనర్‌తో కూడా తాను మాట్లాడానని కిషన్ రెడ్డి తెలిపారు. సమస్యను పరిష్కరించి సర్వీస్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయడంలో ముఖ్యమంత్రి వ్యక్తిగతంగా చొరవ చూపాలని కిషన్ రెడ్డి కోరారు. తెలంగాణలో 2014 నుంచి ఇప్పటి వరకు 2 వేల 800 కిలోమీటర్ల జాతీయ

రహదారులు నిర్మించగా, మరో 2 వేల 500 కిలోమీటర్లు నిర్మాణంలో ఉన్నాయని లేఖలో కేంద్ర మంత్రి ప్రస్తావించారు.

డెస్క్

**పొంగులేటి**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలపై వరంగల్, మహబూబాబాద్ జిల్లా కేంద్రాల్లో ప్రజా ప్రతినిధులు, కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష నిర్వహించారు. వరంగల్ లో జరదిగిన ఈ సమావేశంలో రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ కూడా పాల్గొన్నారు. ప్రజలకు ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, పెండింగ్ పనుల స్థితిగతులపై అధికారులు సమగ్ర వివరాలు సమర్పించారు.

పిటిసి, వరంగల్, మహబూబాబాద్

**సీతక్క**

'మహిళా ప్రగతి – తెలంగాణ ఉన్నతి' అనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మహిళల సాధికారతకు అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. నిజామాబాద్ లో ఈరోజు 'మినీ సరస్ ఫెయిర్ – 2026'ను మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి పాల్గొన్నారు. గ్రామీణ, పట్టణ స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన ప్రదర్శన, విక్రయ స్టాళ్లను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మహిళల ఆర్థికాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం వడ్డీ లేని రుణాలు, ఉచిత ప్రమాద బీమా, లోన్ బీమా, ఆర్టీసీ అద్దె బస్సులు, పెట్రోల్ బ్యాంకులు, సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు వంటి పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు.

పిటిసి, కామారెడ్డి

**తుమ్మల, పొన్నం సమీక్ష**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధికారులతో ఈరోజు కరీంనగర్ లో మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా 99 రోజుల ప్రణాళికలో చేపట్టే అంశాలను పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా అందరికి వివరించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం 10 అంశాలను వివరించారు. ప్రభుత్వం చేపట్టే ఈ కార్యక్రమం ప్రజలకి చేరువయ్యేలా వివిధ రకాల కార్యక్రమాలు చేపట్టాలని మంత్రి పొన్నం సూచించారు.

పిటిసి, కరీంనగర్

**జూపల్లి**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణను జిల్లాల్లో సమర్థవంతంగా అమలు చేయాలని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. ఆదిలాబాద్ జిల్లా కలెక్టరేట్ లో ఈరోజు నిర్వహించిన సమీక్షా సమావేశంలో అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పెండింగ్ పనులను వేగవంతం చేయాలని, భూ సేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీరు అందించాలని ఆదేశించారు. వేసవి కాలంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జాబితాను ఆధార్, బ్యాంక్ ఖాతాలకు అనుసంధించాలని, ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలని, ఇసుక అక్రమ రవాణా, మైనింగ్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు.

డెస్క్

**దామోదర్ రాజనర్సింహ**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోన్న 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో నోడల్ అధికారులు ముఖ్య భూమిక పోషించాలని వైద్యా రోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఉమ్మడి

మహబూబ్ నగర్ జిల్లా ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 3వ విడత కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో జిల్లా కలెక్టర్లకు, అధికారులకు మంత్రి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని, మహిళా సంఘాలను పెద్ద ఎత్తున పాల్గొనేలా గ్రామసభలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నారెడ్డి సహా పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు పాల్గొన్నారు.

**డెస్క్**

**బీజేపీ**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో దేశంలోని మహిళలకు అపార గౌరవం, అవకాశాలు లభిస్తున్నాయని, "నారీ శక్తి" అనే భావన కేవలం బిజెపి నినాదమే కాదని.. దేశ నిర్మాణానికి సంబంధించిన ఒక జాతీయ మిషన్ అని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. హైదరాబాద్ లో బిజెపి రాష్ట్ర మహిళా మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయనతో పాటు.. ఢిల్లీ ఎంపీ బన్సూరీ స్వరాజ్, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ... ఒకప్పుడు దేశంలో ఆడబిడ్డ పుట్టడాన్ని నిర్లక్ష్యంగా చూసే పరిస్థితులు ఉండేవని, కానీ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్యమరీతిలో ప్రారంభించిన బేటీ బచావో, బేటీ పఢావో పథకం వల్ల సమాజంలో పెద్ద మార్పు వచ్చిందన్నారు. నేడు ఆడబిడ్డలకు విద్య, సాధికారత కల్పించే దిశగా దేశం ముందుకు సాగుతోందన్నారు. కోట్లాది మంది పేద కుటుంబాలకు పక్కా ఇల్లు కల్పిస్తూ, మహిళల పేరుతో ఇంటి హక్కు, తక్కువ వడ్డీతో రుణాలు, అధిక సబ్సిడీ కల్పిస్తూ సొంతింట కలను సాకారం చేశారని రామచందర్ రావు అన్నారు.

**డెస్క్**

**అంతర్జాతీయ మహిళా దినోత్సవం**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో ఈవాళ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి కే. శిల్పవల్లి,

డిసిపి ఖైరతాబాద్ జోన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మహిళలు అన్ని రంగాల్లో ముందున్నారని, ఒక కానిస్టేబుల్ నుంచి అంతరిక్ష వ్యోమగామిగా కూడా రాణిస్తున్నారని తెలిపారు. మహిళలు వివక్షను ఏ మాత్రం సహించవద్దని స్పష్టం చేశారు. మహిళల రక్షణకు, సహాయానికి తెలంగాణ పోలీస్ అనేక చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. ఇప్పుడు మహిళలు పోలీస్ స్టేషన్లకు రావల్సిన అవసరం లేదని, సాంకేతికతను ఉపయోగిస్తూ మహిళల గోప్యతను కాపాడుతూ అనేక కేసులను పరిష్కరిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి డైరెక్టర్ జనరల్ హరి సింగ్, హెడ్ ఆఫ్ ప్రోగ్రాం రమేష్ సుంకసారి, హెడ్ ఆఫ్ ప్రోగ్రాం కమర్షియల్స్ ప్రసన్న, అడ్మిన్ ఆఫీసర్ ఫణికుమారి, న్యూస్ ఎడిటర్ శ్రీనివాస్ మాంకాళితో పాటు పెద్ద ఎత్తున సిబ్బంది పాల్గొన్నారు.

ఎం.ఎస్

**ప్రదర్శన**

హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో ఇండియా హ్యాండ్ మేడ్ కలెక్టివ్, సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ సంయుక్త ఆధ్వర్యంలో ఈరోజు హస్తకళల ప్రత్యేక ప్రదర్శన ప్రారంభమైంది. చేతివృత్తిదారులను ఒకే వేదికపైకి తీసుకురావడం, వారు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపడం, హస్తకళలకు విస్తృత మార్కెట్ అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని సినీనటి, ఎనిమల్ రైట్స్ కార్యకర్త అమల అక్కినేని, SERP సీఈఓ దివ్య దేవరాజన్ తదితరులు ప్రారంభించారు. అనంతరం ఎక్స్ పీరియన్స్ సెంటర్‌తో పాటు విక్రయాలతో కూడిన ప్రత్యేక ప్రదర్శనను వారు సందర్శించారు.

**డెస్క్**

**<u>ఐ అండ్ పీఆర్</u>**

రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు నుంచి 99 రోజుల పాటు నిర్వహిస్తోన్న ప్రజాపాలనా - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని హైదరాబాద్ మాసాబ్ ట్యాంక్ లోని సమాచార, పౌర సంబంధాల శాఖ

కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్ ప్రియాంక మొక్కలు నాటారు. కార్యాలయ ఆవరణలో పరిసరాలను, కార్యాలయంలోని ప్రతి సెక్షన్ ను తనిఖీ చేసారు. అనంతరం అధికారులు సిబ్బందితో మాట్లాడుతూ ప్రతి సెక్షన్ లో ఉన్న ఫైళ్లను సక్రమంగా పరిశుభ్రంగా నిర్వహించాలని, పెండింగ్ లో ఉన్న ఫైళ్ళను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ తో పాటు సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కిషోర్ బాబు, అడిషనల్ డైరెక్టర్ డి.ఎస్.జగన్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ వి. రాధా కిషన్ ఆర్ఐలు జె. రాములు, పి. జయరాం మూర్తి, ఉప సంచాలకులు యం. మధు సూదన్, వై. వెంకటేశ్వర్లు, ఎస్.ఏ, హష్మి, రాజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డెస్క్

**సివిల్ సర్వీసెస్ ఫలితాలు**

సివిల్ సర్వీసెస్ పరీక్ష 2025 తుది ఫలితాలు ఈరోజు ప్రకటించారు. గత యేడాది మే 25వ తేదీ నిర్వహించిన సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షకు 9 లక్షల 30 వేలకు పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తెలిపింది. వివిధ సర్వీసులకు నియామకం కోసం కమిషన్ 659 మంది పురుషులు, 299 మంది మహిళలతో సహా మొత్తం 958 మంది అభ్యర్థులను సిఫార్సు చేసిందని తెలిపింది. అనుజ్ అగ్నిహోత్రి మొదటి స్థానాన్ని, రాజేశ్వరి సువే, ఆకాంక్ష్ ధుల్ రెండవ, మూడవ ర్యాంకులను సాధించారని UPSC తెలిపింది.

**ఎస్ఎస్డీ**

**సివిల్స్ – ములుగు**

ములుగు జిల్లా, ఏటూరు నాగారం మండలానికి చెందిన దైనంపల్లి ప్రవీణ్  ఈరోజు విడుదలైన సివిల్స్ ఫలితాల్లో 793 వ ర్యాంక్ ర్యాంకు సాధించారు. ఇప్పటికే గ్రూప్-1 పరీక్షల్లో 105వ

ర్యాంక్ సాధించి డీఎస్పీగా ఎంపికైన ప్రవీణ్, డీఎస్పీ శిక్షణ పొందుతూనే సివిల్స్ కు ప్రిపేరై ర్యాంకు సాధించి ములుగు జిల్లాకు గర్వకారణంగా నిలిచారు.

పిటిసి, ములుగు